



EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
ఆదివారం
30-11-2025
పేజీలు: 02




## సోషల్ మీడియాలో మైనర్లకు నో ఎంట్రీ?

రకరకాల సోషల్ మీడియా యాప్స్ విచ్చలవిడిగా పుట్టుకొస్తున్నాయి. దీంతో యువత వీటికి ఎడిక్ట్ అయిపోతున్నారు. 24 గంటలు సోషల్ మీడియాలోనే ఉంటూ తమ విలువైన జీవితాన్ని కోల్పోతున్నారు. అంతేకాకుండా సోషల్ మీడియాకు ప్రభావితమై అనేక చెడు పనులకు కూడా పాల్పడుతున్నారు. చిన్న వయస్సులోనే సోషల్ మీడియాకు బానిసలుగా మారడం ద్వారా మానసికంగా చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో మైనర్లకు సోషల్ మీడియాలో యాక్సెస్ లేకుండా చాలా దేశాలు నిషేధం విధిస్తున్నారు. ఇటీవల ఆస్ట్రేలియా 18 ఏళ్లలోపు పిల్లలు సోషల్ మీడియా వాడకుండా నిషేధం విధించగా.. మరికొన్ని దేశాలు కూడా ఈ దిశగా అడుగులు వేస్తున్నాయి. ఈ క్రమంలో ఇండియాలో కూడా సోషల్ మీడియాలోకి మైనర్లకు అనమతి లేకుండా నిబంధనలు తీసుకోవాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఇదే తరుణంలో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. మైనసర్ల అనుచిత ఆన్‌లైన్ కంటెంట్ వినియోగించకుండా ఆధార్ ఆధారిత వయస్సు ధృవీకరణ చేయాలని సూచించింది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్య గుర్చి నేతృత్వంలోని ధర్మాసనం తాజాగా ఓ కేసులో ఈ విషయాన్ని నొక్కి చెప్పింది. మైనర్లు అశ్లీల ఆన్‌లైన్ కంటెంట్‌ను చూడకుండా కఠిన చట్టాలు తీసుకురావాల్సిన అవసరం ఉందని తెలిపింది.



## ముంబై X ఆర్‌సీబీ.. జనవరి 9 నుంచి డబ్ల్యూపీఎల్


మహిళల ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపీఎల్) షెడ్యూల్ ఖరారైంది. జనవరి 9వ తేదీ నుంచి డబ్ల్యూపీఎల్ నాలుగో సీజన్ మొదలుకానుంది. లీగ్ షెడ్యూల్‌ను నిర్వాహకులు శనివారం అధికారికంగా ప్రకటించారు. సొంతగడ్డపై జరుగనున్న టీ20 ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుని గత సీజన్లకు భిన్నంగా ఈసారి లీగ్‌ను ముందుగా నిర్వహిస్తున్నారు.డబ్ల్యూపీఎల్ నాలుగో సీజన్ మ్యాచ్‌లు నేవీ ముంబైతో పాటు వడోదర వేదికలుగా జరుగనున్నాయి. డీవై పాటిల్ స్టేడియంలో డిఫెండింగ్ చాంపియన్ ముంబై ఇండియన్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) జట్ల మధ్య మ్యాచ్‌తో డబ్ల్యూపీఎల్‌కు తెరలేవనుంది. లీగ్‌లో తొలి 11 మ్యాచ్‌లకు ముంబై ఆతిథ్యమివ్వనుండగా, మిగిలిన 11 మ్యాచ్‌లు వడోదరలో జరుగుతాయి.

## కొండగట్టులో ఘోర అగ్నిప్రమాదం
# భారీగా ఆస్తి నష్టం!

తెలుగు రాష్ట్రాల్లో వరుసగా జరుగుతున్న అగ్నిప్రమాదాలు ప్రజల్లో తీవ్ర ఆందోళన కలగజేస్తున్నాయి. జగిత్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టులో ఘోర అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. అభయ హనుమాన్ విగ్రహం నుంచి ప్రధాన రహదారి వరకు వరుసగా ఉన్న బొమ్మల దుకాణాలు మంటల్లో దగ్ధమయ్యాయి. శనివారం అర్ధరాత్రి ఘటన జరగగా భారీ ఆస్తినష్టం జరిగినట్టు చెబుతున్నారు. సమ్మక్క-సారలమ్మ జాతర సమీపిస్తున్న నేపథ్యంలో ఈ తరహా ఘటన అందరినీ షాక్ కి గురి చేస్తోంది. అర్ధరాత్రి సుమారు 11 గంటల సమయంలో బొమ్మల దుకాణాల్లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయని అంటున్నారు. ఆ తర్వాత



మంటలు వేగంగా వ్యాపించడంతో మొత్తం 32 బొమ్మల దుకాణాలు పూర్తిగా దగ్ధమయ్యాయని వాపోతున్నారు. దీంతో కోట్లాది రూపాయల విలువైన సామగ్రి తగలబడిందని అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ఒక్కో దుకాణంలో రూ.8 లక్షల నుండి రూ.10 లక్షల వరకు స్టాక్ ఉన్నట్లు వ్యాపారులు వాపోతున్నారు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజిన్ల సాయంతో మంటలను అదుపు చేశారు. కానీ అప్పటికే దుకాణాలు పూర్తిగా కాలిపోయినట్టు స్పష్టం చేశారు. అయితే ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడం కొంత ఊరటనిచ్చే విషయం. ఇక షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ భారీ అగ్ని ప్రమాదం సంభవించినట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. కేసు నమోదు చేసి అగ్నిప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలపై దర్యాప్తు చేపట్టినట్టు వివరించారు. వేలాది మంది వచ్చే సమ్మక్క-సారలమ్మ జాతర కోసం కొండగట్టు ప్రాంతం సిద్ధమవుతుండగా.. అనుకోని విధంగా ఈ అగ్ని ప్రమాదం జరగడం స్థానికుల్లో విషాదం నింపుతోంది.




# దూసుకొస్తున్న దిత్వా తుఫాన్

నైరుతి బంగాళాఖాతంలో దిత్వా తుఫాన్ ప్రభావం కొనసాగుతోంది. ప్రస్తుతం ఇది కారైకాల్ కు 80 కి.మీ., పుదుచ్చేరికి 160 కి.మీ., చెన్నైకి 250 కి.మీ. దూరంలో కేంద్రీకృతమై ఉన్నట్టు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. గడచిన 6 గంటల్లో సుమారు 5 కి.మీ వేగంతో ఈ తుఫాను కదిలినట్టు తెలిపింది. మరో 24 గంటల్లో ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి తీరాలకు సమాంతరంగా కదిలే అవకాశముందంది. దీంతో ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.బంగాళాఖాతంలో కొనసాగుతున్న దిత్వా తుఫాను ప్రభావంతో.. పలు జిల్లాలకు భారీ వర్ష సూచనలు కనిపిస్తున్నాయి. ప్రకాశం, అన్నమయ్య, వైఎస్ఆర్ కడప, అనంతపురం, శ్రీ సత్యసాయి, కర్నూలు, నంద్యాల, పల్నాడు, బాపట్ల, గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. దీంతో శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. దిత్వా తుఫాన్ కొనసాగుతున్న నేపథ్యంలో ఉమ్మడి నెల్లూరు(Nellore) జిల్లా వ్యాప్తంగా తెలికపాటి నుంచి ఓ మోస్తరు జల్లులు కురుస్తున్నాయి. దీంతో సముద్రంలో అలల ఉద్ధృతి అంతకంతకూ పెరుగుతోంది. జలాశయాలు, రిజర్వాయర్లు, చెరువులు ఇప్పటికే నిండుకుండల్లా మారగా.. భారీ వర్షాల నేపథ్యంలో ప్రమాదం పొంచిఉంది. ఇప్పటికే పలు ప్రాంతాల్లో వరినార్లు నీటమునిగాయి. వరుసగా మూడు తుఫాన్లు సంభవించడంతో మూడు నెలలుగా అక్కడ చేపలవేట స్తంభించింది. ఫలితంగా మత్స్యకారులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కృష్ణపట్నం పోర్టులో ఇప్పటికే మూడో నంబర్ ప్రమాద సూచికలు జారీ అయ్యాయి. దీంతో కృష్ణపట్నం పోర్టు, జువ్వలదిన్నె షిప్పింగ్ హార్బర్లకు చేరుకున్నాయి మరబోట్లు.



## నాకు మొదటి అవకాశం
# అలా వచ్చింది

'ఉప్పెన' చిత్రంతో తొలి సినిమాకే ఓవర్‌నైట్ స్టార్‌గా మారిన నటి కృతి శెట్టి, తాను సినీ రంగంలోకి అనుకోకుండా ఎలా అడుగుపెట్టిందీ ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నారు. ఒకప్పుడు వరుస ఆఫర్లతో దూసుకెళ్లిన ఆమె, ప్రస్తుతం ఫ్లాపులతో సతమతమవుతూ తమిళ చిత్రాలపై దృష్టి సారించారు.తన కెరీర్ ఆరంభం గురించి కృతి మాట్లాడుతూ... "నేనొక కమర్షియల్ యాడ్ ఆడిషన్ కోసం స్టూడియోకి వెళ్లాను. ఆడిషన్ తర్వాత నన్ను తీసుకెళ్లడానికి నాన్న రావాల్సి ఉండగా, ఆయనకు కాస్త ఆలస్యమైంది. ఆ ఖాళీ సమయంలో పక్కనే ఉన్న మరో స్టూడియోలోకి వెళ్లాను. అక్కడ ఒక సినిమా ఆడిషన్స్ జరుగుతున్నాయి. నన్ను చూసిన యూనిట్ సభ్యులు సినిమాల్లో నటిస్తావా? అని అడిగారు. ఏం చెప్పాలో తెలియక మా అమ్మ నంబర్ ఇచ్చి వచ్చేశాను. వాళ్లు అమ్మకు ఫోన్ చేసి ఆడిషన్‌కు పిలిచారు. అలా అనుకోకుండా నాకు 'ఉప్పెన' సినిమాలో హీరోయిన్‌గా అవకాశం వచ్చింది. అంతా ఓ కలలా జరిగిపోయింది" అని వివరించారు.

## తెలంగాణలో
# ఇందిరమ్మ చీరల పంపిణీకి బ్రేక్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమానికి తాత్కాలికంగా విరామం ప్రకటించారు. రాష్ట్రంలో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల కారణంగా.. ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో.. ఈ చీరల పంపిణీని నిలిపివేయాలని ఎన్నికల సంఘం అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా.. గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నికల ప్రక్రియ మొదలవడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని మహిళలకు పండుగలు, ఇతర సందర్భాలను పురస్కరించుకొని ఉచితంగా చీరలను పంపిణీ చేయాలని ప్రభుత్వం ఈ ఇందిరమ్మ చీరల పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం ద్వారా వస్త్ర పరిశ్రమకు, ముఖ్యంగా చేనేత కార్మికులకు ఉపాధి కల్పించడం కూడా ఒక ముఖ్య ఉద్దేశం. రాష్ట్ర ప్రభుత్వం కోటి చీరలను మహిళలకు పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటివరకు ప్రభుత్వం దాదాపు 44 లక్షల చీరలను లబ్ధిదారులకు విజయవంతంగా పంపిణీ చేసింది. స్తుతం గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పటికీ.. అధికారులు పట్టణ ప్రాంతాల్లోని మహిళలకు ఈ చీరలను అందించేందుకు కొత్త కార్యాచరణను ప్రకటించారు. పట్టణ ప్రాంతాల్లోని మహిళా లబ్ధిదారులకు మార్చి 1వ తేదీ నుంచి మార్చి 8వ తేదీ వరకు ఈ ఇందిరమ్మ చీరలను పంపిణీ చేయనున్నారు.



అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ చీరలను పంపిణీ చేయడం ద్వారా ఈ పథకానికి మరింత ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వం యోచిస్తోంది. గ్రామ పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల, నామినేషన్ల స్వీకరణతో రాష్ట్రంలో ఎన్నికల వేడి మొదలైంది. ఈ స్థానిక సంస్థల ఎన్నికలు రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి అత్యంత ప్రతిష్టాత్మకంగా మారాయి. ఇటీవల జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో భారీ మెజార్టీతో విజయం సాధించిన కాంగ్రెస్ పార్టీ.. అదే ఉత్సాహంతో ఈ లోకల్ బాడీ ఎన్నికల్లోనూ తమ రాజకీయ వ్యూహాలను అమలు చేస్తోంది. పంచాయతీ ఎన్నికలు మూడు విడతలుగా జరగనున్నాయి. తొలి విడత డిసెంబర్ 11న, రెండో విడత డిసెంబర్ 14న, మూడో విడత డిసెంబర్ 17న నిర్వహించనున్నారు. ఎన్నికలు ముగిసిన.. కోడ్ ఎత్తివేసిన తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో మిగిలిన చీరల పంపిణీని వెంటనే పునఃప్రారంభించడానికి అధికారులు సిద్ధంగా ఉన్నారు.

# పాకిస్తాన్‌కి ఫిన్లాండ్ షాక్



పాకిస్తాన్ ఎంత ఇన్వైట్ చేసినా, ఇతర ముస్లిం దేశాలు పట్టించుకోవడం లేదు. సౌదీ అరేబియా, యూఏఈ వంటి ఇస్లామిక్ దేశాలు పాకిస్తానీయులకు నో ఎంట్రీ బోర్డు వేస్తున్నాయి.పాకిస్తాన్ నుంచి వెళ్లిన కొందరు అక్కడ భిక్షాటన, నేరాలకు పాల్పడటంతో ఈ దేశాలు పాకిస్తానీయులకు వీసాలు మంజూరు చేయడం మానేసాయి.ఇలా ఉన్నప్పటికీ, తాజాగా పాకిస్తాన్ మరో షాక్ ఎదుర్కొంది. ఆపరేషనల్ మరియు వ్యూహాత్మక కారణాలను సూచిస్తూ, ఫిన్లాండ్ పాకిస్తాన్‌లో తన రాయబార కార్యాలయాన్ని మూసివేయనుంది. అదే విధంగా ఆఫ్గనిస్తాన్, మయన్మార్‌లో కూడా ఫిన్లాండ్ ఎంబసీలను మూసివేస్తున్నట్లు ప్రకటించింది.ఫిన్లాండ్ విదేశాంగ మంత్రి శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో చెప్పారు:"2026లో ఇస్లామాబాద్, కాబూల్, యాంగోన్‌లోని ఫిన్లాండ్ రాయబార కార్యాలయాలను మూసివేయాలని విదేశాంగ మంత్రిత్వ శాఖ నిర్ణయించింది. ఆపరేషనల్ మరియు వ్యూహాత్మక కారణాల వల్ల ఈ కార్యాలయాలు మూసివేయబడతాయి. ఇది దేశాల రాజకీయ పరిస్థితులు మరియు ఫిన్లాండ్‌తో పరిమిత వాణిజ్య, ఆర్థిక సంబంధాలతో ముడిపడింది."ఫిన్లాండ్ మంత్రిత్వ శాఖ తెలిపింది, పాకిస్తాన్ సహా మూడు దేశాల్లో రాయబార కార్యాలయాలు మూసివేయడానికి సన్నాహాలు ఇప్పటికే మొదలయ్యాయని. వ్యూహాత్మక సమీక్షలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ముఖ్యమైన దేశాలకు వనరులను కేంద్రీకరించడం ఫిన్లాండ్ వ్యూహంలో ముఖ్యమని పేర్కొన్నారు.



## ఢిల్లీలో భారీ అగ్ని ప్రమాదం.. నలుగురు మృతి

ఢిల్లీలో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. దక్షిణ ఢిల్లీ ప్రాంతం సంగం విహార్‌లోని ఓ నివాస భవనంలో పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో నలుగురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరు గాయపడ్డారు. మృతుల్లో ఒకే కుటుంబానికి చెందిన అన్నాచెల్లెళ్లు.. బిల్డింగ్ యజమాని సతీందర్ గుప్తా(38), ఆయన సోదరి అనిత(40) సజీవ దహనమయ్యారు. తీవ్రంగా గాయపడిన మరొక వ్యక్తిని ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ మరణించారు. ఆ వ్యక్తితో సహా మృతిచెందిన మరొకరు ఎవరనేది తెలియాల్సి ఉంది. ఈ ఘటనలో మమత(40) అనే మహిళ కాలిన గాయాలతో బయటపడ్డారు. మరో మహిళ తనను తాను రక్షించుకోవడంలో భాగంగా టెర్రస్‌పై నుంచి కిందకు దూకి గాయపడ్డారు. ప్రస్తుతం వీరిద్దరినీ ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నారు.

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM



# వీర్లగడ్డ తండా సర్పంచ్, వార్డు సభ్యులు ఎన్నిక ఏకగ్రీవం

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలో వీర్లగడ్డ తండా గ్రామపంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నిక ఏకగ్రీవమైంది. వీర్లగడ్డ తండాలో 670 వరకు జనాభా ఉండగా, 519 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 275 మంది ఉండగా, మహిళలు 244 మంది ఉన్నారు. గ్రామంలో సర్పంచ్ స్థానానికి గుగులోతు పూర్ణిమ ఒకే ఒక్క అభ్యర్థి నామినేషన్ రావడంతో ఆమె ఎన్నిక ఏకగ్రీవమైంది. గ్రామంలో ఆరు వార్డులు ఉండగా, అన్ని వార్డుల్లోనూ ఒక్కటి మాత్రమే నామినేషన్ రావడంతో వారి ఎన్నిక సైతం ఏకగ్రీవమైంది. ఒకటో వార్డులో గుగులోతు హరిలాల్, 2వ వార్డులో గుగులోతు రమేష్, 3వ వార్డులో గుగులోతు బూలీ, 4వ వార్డులో లావుడ్య రంజిత్ కుమార్, 5వ వార్డులో లావుడ్య లలిత, 6వ వార్డులో బానోతు కిషన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అయితే వీరి ఎన్నిక అధికారులు ప్రకటించాల్సి ఉంది. తండావాసులు పోటీ లేకుండా గ్రామంలో సమావేశమై సమిష్టిగా సర్పంచ్, వార్డు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాజకీయాలకు అతీతంగా తండాను కలిసికట్టుగా అభివృద్ధి చేసుకుని మండలంలోనే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని ప్రగాఢంగా యోచిస్తున్నారు. గ్రామపంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నిక కావడం పట్ల తండా వాసుల సంబరాలు అంబరాన్నంటాయి.




# సమోసా రూ.10, బిర్యానీ రూ.150.. స్థానిక ఎన్నికల్లో ధరలు ఖరారు

స్థానిక ఎన్నికల నేపథ్యంలో, ప్రచారంలో అభ్యర్థులు చేసే ఖర్చులకు సంబంధించి పలు వస్తువుల ధరలను రాష్ట్ర ఎన్నికల కమిషన్ (SEC) విడుదల చేసింది. టీ రూ.5, కాఫీ రూ.10, సమోసా రూ.10, బిర్యానీ రూ.150గా నిర్ణయించింది. వాహనాలు, కండువాలు, ఫ్లెక్సీలు వంటి ఇతర వస్తువుల ధరలను కూడా ప్రకటించింది. దీని ప్రకారం, ప్రచారంలో వినియోగించిన వస్తువుల ఖర్చును అభ్యర్థులు తమ లెక్కల్లో చూపించాలి. లేనిపక్షంలో వ్యయ పరిశీలకులే ఆ ఖర్చును లెక్కలో చేరుస్తారు.

# ఆ స్లీపర్ బస్సులు ఇక వాడొద్దు, పక్కన పెట్టేయండి


దేశంలోని పలు ప్రాంతాల్లో ఇటీవల వరుసగా జరుగుతున్న ఘోర బస్సు ప్రమాదాల నేపథ్యంలో ప్రయాణికుల భద్రతపై జాతీయ మానవ హక్కుల కమిషన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న స్లీపర్ కోచ్ బస్సులను తక్షణమే రోడ్లపై నుంచి పక్కన పెట్టేయాలని NHRC అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు కీలక మార్గదర్శకాలు జారీ చేసింది. దూర ప్రాంతాలకు వెళ్లే ప్రైవేట్ స్లీపర్ బస్సుల్లో భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ఈ ఘోర ప్రమాదాలు జరుగుతున్నాయని.. దీనివల్ల అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. కర్నూలు, సౌదీ బస్సు ప్రమాదాల వంటి ఘటనల కారణంగా ట్రావెల్స్ బస్సుల్లో ప్రయాణం ఎంత వరకు సురక్షితమనే ప్రశ్నలు ప్రజల్లో తలెత్తుతున్నాయి. దీనిపై పలువురు ఫిర్యాదు చేయడంతో




మానవ హక్కుల కమిషన్ రంగంలోకి దిగింది.

**ప్రమాదాలకు కారణాలు ఇవే..!**

ప్రస్తుతం దేశంలో తిరుగుతున్న బస్సుల్లో 50 శాతానికి పైగా స్లీపర్ ఏసీ బస్సులే ఉంటున్నాయి. అయితే ట్రావెల్స్ సంస్థలు ఇష్టానుసారం బస్సులను మార్పులు చేర్పులు చేసి నడపడం వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అంతేకాకుండా చాలా బస్సుల్లో అగ్ని ప్రమాదాలను నియంత్రించే రక్షణ వ్యవస్థలు (ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు) ఉండటం లేదు. ట్రావెల్స్ సంస్థలు కూడా బస్సుల కండీషన్‌పై ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టడం లేదు. ఇది చాలదన్నట్లుగా అత్యవసర ద్వారం ఉన్నచోట్ల కూడా సీట్లు ఏర్పాటు చేయడం లేదా అదనపు సీట్ల నిర్మాణంతో ప్రమాద సమయాల్లో అవి నిరుపయోగంగా మారుతున్నాయి. దీంతో ప్రమాద సమయాల్లో ప్రయాణికులు వాటిని తీసేసి బయటకు వెళ్లలేకపోతున్నారు. స్లీపర్ ఏసీ బస్సుల లోపలి భాగం ఇరుగ్గా ఉండటం వల్ల అగ్ని ప్రమాదాలు, రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే బయటకు వచ్చే అవకాశం తక్కువగా ఉంటోంది. స్లీపర్ బస్సుల అడుగు భాగంలో సరకు నిల్వకు ఏర్పాట్లు ఉంటాయి. వీటిలో అగ్ని ప్రమాదాలు జరిగితే మంటలు నేరుగా ప్రయాణికులపై ప్రభావం చూపుతున్నాయి. కనీసం వారంతా వెంటనే బయటకు రాలేకపోతున్నారు. ముఖ్యంగా నిబంధనలు ఉల్లంఘించి, ప్రయాణికుల ప్రాణాలను పణంగా పెడుతున్న ట్రావెల్స్ సంస్థలపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని NHRC ఆదేశించింది.



# మరోసారి పేలిన తూటా.. అమెరికా గన్‌కల్చర్‌కు నలుగురు బలి!

అగ్రరాజ్యం అమెరికాలో గన్ కల్చర్ రోజురోజుకూ పెరిగిపోతుంది. కొందరు దుండగుల పగలు ప్రతీకారాలకు అమాయక ప్రజలు బలవుతున్నారు. ఇలాంటి ఘటనపై స్థానిక ప్రభుత్వాలు ఎన్ని కఠిన నిర్ణయాలు తీసుకున్న వాళ్లలో మాత్రం ఎలాంటి మార్పులు రావడం లేదు. తరచూ ఎక్కడో అక్కడ ఇలాంటి ఘటనలు నమోదవుతూనే ఉన్నాయి. ఈ దుండగుల కాల్పుల్లో భారత్ నుంచి వెళ్లిన ఎందరో విద్యార్థులు కూడా ప్రాణాలు కోల్పోయారు. తాజాగా కాలిఫోర్నియాలో బర్తడే వేడుకల్లో జరిగిన కాల్పుల్లోనూ నలుగు అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. మరికొందరు గాయపడ్డారు. క్షతగాత్రుల్లో ఉక్కువ శాతం చిన్నారులే ఉన్నారు. వివరాల్లోకి వెళ్తే.. కాలిఫోర్నియాలో స్టాక్‌టన్‌లో ఆదివారం పుట్టిన రోజు వేడుకలు జరుగుతున్నాయి. ఇంతలో పార్టీలోకి వచ్చిన కొందరు వ్యక్తులు తమ చేతిలో ఉన్న తుపాకులతో బర్త్‌డే వేడుకలు జరుపుకుంటున్న వారిపై విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డారు. ఈ మారణహోమంలో నగులురు వ్యక్తులు స్పాట్‌లోనే ప్రాణాలు కోల్పోగా సుమారు 10 మందికిపైగా తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. రక్తపు మడుగుల్లో పడిఉన్న మృతదేహాలను స్వాధీనం చేసుకొని పోస్ట్‌మార్టం నిమిత్తం హాస్పిటల్‌కు తరలించారు. గాయపడిన క్షతగాత్రులకు చికిత్స అందించారు. మృతులు, క్షతగాత్రుల్లో ఎక్కువ మంది పిల్లలే ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. ఘటనపై కేసు నమోదు చేసి ఈ ఘాతుకానికి పాల్పడిన నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సీసీ కెమెరా దృశ్యాల ఆధారంగా ఈ దాడికి పాల్పడిన వారిని గుర్తించే పనిలో ఉన్నారు పోలీసులు.



# రోడ్లపై కొత్త ట్రాఫిక్ రూల్స్.. ఇకపై రద్దీకి చెక్ పడుతుంది!

ఖమ్మం నగరంలో వాహనాల రద్దీ రోజురోజుకూ పెరిగిపోతోంది. గంటల తరబడి ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకుని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను అరికట్టేందుకు ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ (కేఎంసీ) అధికారులు చైతన్యం ప్రదర్శిస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రధాన కూడళ్ల వద్ద బారియర్స్, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడం ద్వారా ట్రాఫిక్‌ను క్రమబద్ధం చేయనున్నారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశాల మేరకు, కమిషనర్ అభిషేక్ అగస్త్య సూచనలతో ఈ పనులు వేగంగా జరుగుతున్నాయి. శనివారం రాత్రి 23వ, 24వ డివిజన్ల మధ్యలోని బిజీ కూడలి వద్ద తొలుత బారియర్స్ (పోల్స్) ఏర్పాటు చేశారు. అదే సమయంలో రోడ్డు మీద స్పీడ్ బ్రేకర్లను కూడా అమర్చారు. ఈ చోట ఎప్పుడూ గందరగోళ ట్రాఫిక్ ఉండేది కాబట్టి ఇక్కడి నుంచి మొదలుపెట్టారు. ఈ చర్యలు కేవలం ఒక్క చోటికే పరిమితం కాకుండా, ఖమ్మం నగరంలోని మిగతా ప్రధాన రోడ్లు, జంక్షన్ల వద్ద కూడా క్రమంగా అమలు చేయనున్నారు. వాహనదారులు రూల్స్ పాటించేలా చేయడం, వేగం అదుపులో ఉంచడం, వన్-వే సిస్టమ్ సజావుగా పనిచేయడం ఈ ఏర్పాట్ల ముఖ్య ఉద్దేశం. దీనివల్ల ఉదయం-సాయంత్రం గంటల్లో ఎక్కువగా ఏర్పడే ట్రాఫిక్ ఇరుకును గణనీయంగా తగ్గించవచ్చని అధికారులు ఆశిస్తున్నారు. ప్రజలు మొదట్లో కొత్త బారియర్స్, స్పీడ్ బ్రేకర్లకు అలవాటు పడటానికి కొంత ఇబ్బంది పడవచ్చు. కానీ ఈ చిన్న అసౌకర్యం తర్వాత నగరంలో సురక్షితంగా, త్వరగా ప్రయాణించే అవకాశం కలుగుతుందని నిపుణులు అంటున్నారు. ఖమ్మం రోడ్లు ఇకపై మరింత క్రమశిక్షణతో నిండిపోతాయన్న ఆశతో ప్రతి ఒక్కరూ ఈ కొత్త నిబంధనలకు సహకరించాల్సిన సమయం ఆసన్నమైంది.



దర్శకుడు శ్రీను వైట్ల - హీరో శర్వానంద్ కాంబినేషన్ లో ఓ సినిమా రాబోతుంది. ఈ సినిమాలో 'మ్యాడ్', '8 వసంతాలు' ఫేమ్ అనంతిక సనీల్ కుమార్ హీరోయిన్ గా ఫిక్స్ చేసినట్లు తెలుస్తోంది. '8 వసంతాలు' సినిమాతో కుర్రకారు హృదయాలను కొల్లగొట్టేసింది ఈ బ్యూటీ. మరి శర్వానంద్ సరసన ఏ రేంజ్ లో ఆకట్టుకుంటుందో చూడాలి. మరోవైపు శర్వానంద్ ఇప్పటికే ఈ సినిమా కోసం తన లుక్ పై కసరత్తులు చేస్తోందని తెలుస్తోంది. కాగా గోపీచంద్ హీరోగా శ్రీను వైట్ల దర్శకత్వంలో తెరకెక్కిన యాక్షన్ కామెడీ 'విశ్వం' ఏవరేజ్ గా నిలిచింది. దీంతో, ఎలాగైనా మళ్ళీ టాలీవుడ్ లో తన తర్వాత సినిమాతో బిజీ అయ్యేందుకు శ్రీనువైట్ల తెగ కష్ట పడుతున్నాడట. ఈ క్రమంలోనే శర్వాకి కథ చెప్పాడు. కాగా తెలియని వయసులో ఆవేశంలో చేసిన ఓ పని కారణంగా హీరో లైఫ్ లో జరిగే డ్రామా చాలా బాగుంటుందట. ఈ ఏడాది చివర్లో వీరిద్దరి కలయికలో సినిమా మొదలు అవుతుందట. ఈ సినిమాలో మరో సీనియర్ హీరో కూడా కనిపిస్తాడని తెలుస్తోంది. మైత్రీ మూవీ మేకర్స్ ఈ సినిమాను నిర్మించనుంది.

# అనంతిక సనీల్ కుమార్‌తో శర్వా కాంబినేషన్

# నెల్లూరులో మరో లేడీ డాన్..



నెల్లూరు జిల్లాలో ఇటీవల శాంతిభద్రతలు పూర్తిగా గాడి తప్పాయా..! అన్నట్లు ఉంది తాజా పరిస్థితి. తప్పు చేసిన వారిని పట్టుకునేందుకు వెళ్లిన పోలీసులపై దాడికి దిగుతున్న సందర్భాలు ఇటీవల చాలానే జరిగాయి. గతంలో విజయవాడ నుంచి గంజాయి దందా చేపడుతున్న ముఠాను పోలీసులు వెంబండించగా.. నెల్లూరులో పోలీసులపై దాడికి పాల్పడ్డారు. ఆ సందర్భంలో పోలీసులు కాల్పులు జరిపి ప్రాణాలు కాపాడుకోవాల్సి వచ్చింది. ఇటీవలే రౌడీ షీటర్ శ్రీకాంత్, అతని ప్రియురాలు నిడిగుంట అరుణ వ్యవహారం బయటపడింది. పెరోల్ మీద బయటకు వచ్చి వారిద్దరూ చేసిన సెటిల్మెంట్ల వ్యవహారం వెలుగు చూడగా.. లేడీ డాన్ అరుణ తాజాగా ఓ వ్యక్తిని దారుణంగా హత్య చేసింది. ఆ హంతకులను పట్టుకునేందుకు వెళ్ళిన పోలీసులకు కూడా ఇలాంటి అనుభవమే ఎదురైంది. నెల్లూరు రూరల్ పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీలో కె. పెంచలయ్య(38), దుర్గా దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు బిడ్డలు. ఎలక్ట్రిషియన్ పనులు చేసుకుంటూ జీవనం సాగించే పెంచలయ్య.. కొన్నేళ్ల కిందట బోడిగాడితోట నుంచి హౌసింగ్ బోర్డు కాలనీకి మారారు. సమాజ స్పృహతో పాటు వామపక్ష భావజాలం ఉండే ఈయన.. సీపీఎంలో నాయకుడిగా, ఆర్డీటీ కాలనీ ముత్యాలమ్మ గ్రామాభివద్ధి కమిటీ సభ్యుడిగా ఉన్నారు. కాలనీలో కొందరు యువకులు గంజాయి తాగడం.. విచ్చలవిడిగా విక్రయాలు జరగడం గమనించి అడ్డుకున్నారు. సదరు విక్రయాలు ఓ మహిళ ఆధ్వర్యంలో జరుగుతున్నాయని తెలిసి.. పోలీసులకు సైతం సమాచారం అందించేవారు. దీంతో ఆయనపై కక్ష పెంచుకున్న గంజాయి బ్యాచ్.. ఎలాగైనా అంతమొందించాలని నిర్ణయించుకున్నారు. శుక్రవారం సాయంత్రం పిల్లలతో స్కూటీపై ఇంటికి వెళుతుండగా.. హౌసింగ్ బోర్డు ఆర్చి వద్ద తొమ్మిది మంది గుర్తు తెలియని యువకులు పెంచలయ్యను అడ్డుకున్నారు.

# ఇంటర్ అమ్మాయి.. 9వ తరగతి అబ్బాయి.. గర్భం దాల్చి, శిశువుకు జన్మనిచ్చి

వనపర్తి జిల్లాలో జరిగిన ఒక అత్యంత దారుణమైన ఘటన సమాజాన్ని కలవరపరుస్తోంది. వనపర్తి మండల పరిధిలోని ఒక గ్రామంలో.. కేవలం 9వ తరగతి చదువుతున్న బాలుడు.. ఇంటర్మీడియట్ చదువుతున్న బాలిక ప్రేమ పేరుతో పెట్టుకున్న సంబంధం.. ఒక శిశువు జననానికి దారితీసింది. ఇద్దరూ మైనర్లు కావడం.. ఆ బాలుడు కేవలం 9వ తరగతి విద్యార్థి కావడం ఈ కేసు తీవ్రతను తెలియజేస్తున్నాయి.

అసలు ఏం జరిగింది...?

గ్రామానికి చెందిన ఈ ఇద్దరు విద్యార్థులు కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. ఈ క్రమంలో వారు పలుమార్లు లైంగికంగా కలిశారు. ఈ నేపథ్యంలో బాలిక గర్భం దాల్చింది. విషయాన్ని గుర్తించిన బాలిక తల్లిదండ్రులు వెంటనే రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నెల 14వ తేదీన బాలిక ఒక శిశువుకు జన్మనిచ్చింది. గ్రామంలో పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టినా.. బాలుడి తల్లిదండ్రులు తమ అబ్బాయికి ఈ వ్యవహారంతో ఎలాంటి సంబంధం లేదని తెగేసి చెప్పారు. పోలీసులు కేసు నమోదు చేసినప్పటికీ.. ఇద్దరూ మైనర్లే కావడం, కేసు పోక్సో చట్టం పరిధిలోకి వచ్చే అవకాశం ఉండటంతో చర్యలు తీసుకోవడానికి ఆలోచిస్తున్నారు. ఈ సందిగ్ధతతో పోలీసులు తలలు పట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. బాలిక కుటుంబ సభ్యులు శనివారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. శిశువుకు డీఎన్ఏ పరీక్ష నిర్వహించి.. తమకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ ఘటన ప్రస్తుతం మండలంలో హాట్ టాపిక్‌గా మారింది. పిల్లలు ఈ విధంగా పెడదోవ పట్టడానికి ప్రధాన కారణం తల్లిదండ్రుల పర్యవేక్షణ లోపమే అని చెప్పవచ్చు. నేటి ఉరుకుల పరుగుల జీవితంలో.. తల్లిదండ్రులు ఆర్థిక అవసరాల కోసం ఎక్కువ సమయం కేటాయిస్తున్నారు. ఫలితంగా.. పిల్లలతో గడిపే సమయం తగ్గి, వారిపై శ్రద్ధ, నియంత్రణ కోల్పోతున్నారు. యుక్తవయస్సు మార్పుల గురించి, లైంగిక విద్య గురించి వారికి సరైన అవగాహన అందించడంలో కుటుంబ వ్యవస్థ విఫలమవుతోంది. తమ పిల్లలు ఎలాంటి మానసిక స్థితిలో ఉన్నారో, ఎలాంటి విషయాలపై ఆకర్షితులవుతున్నారో తెలుసుకోలేకపోవడం పెద్ద పొరపాటు. మొబైల్ ఫోన్లు, ఇంటర్నెట్ విస్తృతం కావడం తర్వాతే ఇలాంటి అసాధారణ వ్యవహారాలు పెరిగినట్లు అనేక నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. పర్యవేక్షణ లేని మొబైల్ వాడకం వలన.. అనైతిక, అసభ్యకరమైన దృశ్యాలు సులభంగా అందుబాటులోకి వచ్చాయి. టీనేజర్లలో ఉన్న ఉత్సుకత.. వారు ఇంటర్నెట్ లో చూసిన అంశాలను నిజ జీవితంలో ప్రయత్నించడానికి మొగ్గు చూపుతున్నారు. ఫలితంగా.. లైంగిక ఆకర్షణను కేవలం శారీరక సంబంధంగానే పరిగణిస్తున్నారు. పాఠశాలల్లో విద్య మాత్రమే కాకుండా.. సామాజిక, నైతిక విలువల బోధన అవసరం. యుక్తవయస్సులో వచ్చే మార్పుల గురించి.. సురక్షిత లైంగిక విద్య గురించి కౌన్సిలింగ్ అందించాలి.